# వెలుగుచూసిన క్షణం

సుబ్బారావు అందగాడు విలాస పురుషుడు బ్యాంక్‌లో చక్కని ఉద్యోగం ఎప్పుడూ ఇస్త్రీ నలగని బట్టలేసుకుంటాడు చార్లీ స్ప్రే వాడతాడు వత్తుగా వున్న జుట్టు కొంతభాగం నుదుట మీదకు వాలేలా దువ్వుతాడు ఈ మధ్యే పెళ్ళి చేసుకున్నాడు అందానికీ ఆకర్షణకీ లోటేమీ లేదు— రాధని చక్కని చుక్కనవచ్చు

ఆ ఇంట్లో రెండే కాపురాలు క్రింది భాగంతో సుబ్బారావు వుంటున్నాడు పై భాగంలో మనోహర్ వుంటున్నాడు ఆ యింటి యజమాని మనోహర్, అతని భార్య కమల ఎర్రగా, పొడుగ్గా ఇంకా పొడుగైన వత్తు జుత్తుతో చాలా అందంగా వుంటుంది మనోహర్ కూడా ఎదో అడ్వర్టయిజింగ్ ఏజన్సీలో మంచి ఉద్యోగం చేస్తున్నాడు మద్రాసొచ్చి ఉద్యోగంలో స్థిరపడగానే వూళ్ళో పొలం అమ్మి ఆ యిల్లు కొనుక్కున్నాడు మనోహర్

ఆ యింటి పెత్తనం కమలదే టులెట్ బోర్డు చూసి సుబ్బారావు ఆ యింటి కొచ్చినప్పుడు యింట్లో కమల ఒక్కతే వుంది ఆమె అందం చూసి మూర్ఛపోబోయి ఎలాగో తట్టుకున్నాడు సుబ్బారావు మాట్లాడేటప్పుడు చిన్నగా వణికాడు తడబడ్డాడు చివరికి నిబాయించుకున్నాడు

బ్రహ్మచారులకి యిల్లు యివ్వం' చురుగ్గా సుబ్బారావు కళ్ళలోకి చూస్తూ అంది కమల

ఆ చూపుల్లో చురుకుదనమే కాదు సెంట్ పర్సెంట్ చిలిపితనం కనిపించింది తాను బ్రహ్మచారైనా బావుండేది ఆమె నెలాగో బుట్టలో పెట్టి ఆ యిల్లు అద్దెకు తీసుకోగలడు తను— అనుకున్నాడు సుబ్బారావు

సారీ నాకు పెళ్ళయింది' అన్నాడు ఎలాగో

ఆమె ఆశ్చర్యపోయింది నిజమా' అన్నట్లు పరిశీలనగా చూసింది జవాబు చెప్పలేదు

చూడండీ మీ ఒళ్ళంతా కళ్ళు చేసుకుని నన్ను చూస్తున్నారు నన్ను అబద్ధాల రాయుణ్ణను కుంటున్నారేమో' మా ఆవిడ్ని యిప్పుడే తీసుకొచ్చి మీకు పరిచయం చేయనా? నవ్వుతూ అన్నాడు జుత్తు పైకి తోసుకుంటూ సుబ్బారావు

మీరెవరో నాకు తెలీదు తెలీన వాళ్ళకు యిల్లివ్వం మళ్ళీ నవ్వుతూ అంది కమల

నెత్తి మీద తాటాకుజువ్వ పడ్డట్టు తుళ్ళిపడ్డాడు సుబ్బారావు

మీరెవరో కూడా నాకు తెలీదు బయట టులెట్ బోర్డు పెట్టారు కాబట్టి లోపలి కొచ్చాను అద్దె కొచ్చే వాళ్ళందరూ తెలిసిన వాళ్ళే కావాలనుకుంటే మీరు బోర్డు తీసి లోపల పెట్టుకోండి మీలాంటి సందేహప్రాణి యింట్లో దిగేంత తెలివి తక్కువ వాణ్ణి కాను నేను ఈ డైలాగు మనసులోనే అనుకున్నాడు పైకి మాత్రం నాకిక్కడ ఎవరూ తెలీదండీ ఇండియన్ బ్యాంక్‌లో ఈ మధ్యే ఉద్యోగం వచ్చింది మీరు మా బ్యాంక్ కొస్తే అక్కడ నాకు తెలిసిన వాళ్ళున్నారు తడబడుతూ అన్నాడు

కమల ఈ సారి పైకె నవ్వేసింది ఫర్వాలేదు మీరు సరదాగానే మాట్లాడతారు మూడు ముఖాలకీ ఈ లోకంలో పనిలేని ఖలాసపర్సన్‌కి నాలాంటి అనుమాన ప్రాణులకీ ఈ యిల్లు యివ్వ కూడదనుకున్నాను మీరు ఠాపే దిగొచ్చు అంది

మీరు అసలు సంగతి మాట్లాడనే లేదు అదే అద్దె— యింటి యజమాని షరతులు— మీకు ఎల్లలెంత మందనీ మీరు రాత్రిన్ని గంటల కొస్తారనీ మీరు చైన్ స్మోకరాని అప్పుడప్పుడు స్నేహితులతో యింట్లో పార్టీ చేసుకుంటారాని

యింకా డైలాగ్ కొనసాగేదే గాని కమల మధ్యలో కలుగ జేసుకుంది

ఆగండాగండి మేము ఈ మధ్యే యిల్లు కొనుక్కున్నాం ఇంటి యజమానుల షరతుల గురించి మాకింకా తెలీదు అవన్నీ మీరే ఓ కాగితం మీద రాసి సంతకం పెట్టివ్వండి మీ బ్యాంకు వాళ్ళకి కాగితాలుంటే గానీ నమ్మకాలుండవు గదా' ఏమంటారు అని మరో సారి నవ్వింది కమల

ఎవరో చిన్ననాటి స్నేహితురాలితో మాట్లాడు తున్న అనుభూతి కలిగింది సుబ్బారావుకి

ఆ యింట్లోకొచ్చి వారం కూడా కాలేదు రాధకి యిల్లు బాగా నచ్చింది కమల యింకా బాగా నచ్చింది ఆమె కలుపుగోలుతనం చూసాక రాధ ఆమెని అక్కా అని ఎలవసాగింది

మనోహర్ ఆఫీసు ఎనిమిది గంటలకే మొదలవుతుంది రాత్రెప్పుడొస్తాడో తెలీదు ఒంటరితనం ఎంత దుర్మార్గమైందో కమలకి తెలుసు దాని మీద పగ తీర్చుకోవడానికే క్రింద పోర్షన్ అద్దె కిచ్చేందుకు మనోహర్‌కి చెప్పి ఒప్పించింది మనోహర్‌కి ఆమె ఎంతంటే అంత కమలకి మనోహర్ మాటే వేదం

ఆ యింట్లో కొచ్చిన దగ్గర్నుంచీ సుబ్బారావు మనసులో రోజు రోజుకీ కమల స్థానం పెరిగి పోతోంది కమల ఎప్పుడు కనిపిస్తుందాని ఎదురు చూడడం ఆమెతో ఎక్కువగా మాట్లాడాలని ఉబలాటపడడం ఈ ప్రయత్నంలో రాధ ఏమనుకుంటుందోనన్న ఇంగితం కూడా మర్చిపోవడం జరుగుతోంది

ఒక రోజున రాధ తెలిసిన వాళ్ళింటి కెళ్ళి ఆలస్యంగా వచ్చింది సాయంత్రం తాను రావడానికి తొమ్మిదీ — పదీ కావచ్చని సుబ్బారావుకి రాధ ఉదయమే చెప్పింది సాయంత్రం స్నేహితులు షికార్లూ మానుకుని ఆ రోజు చీకటి పడకుండానే యింటికొచ్చాడు ఇంటికి తాళం వేసుంది తాళం కమలకి యిస్తానని చెప్పింది మెట్లెక్కి మేడ మీద కెళ్ళాడు

కమల అప్పుడే స్నానం చేసి తెల్లచీర కట్టుకుని కురులు దువ్వుకుంటోంది సుబ్బారావుని చూసి తన బ్రాండ్ నవ్వు నవ్వింది ఆ నవ్వుకి సుబ్బారావు పెట్టుకున్న పేరు చిలిపినవ్వు

రాధ నిరగాడు సుబ్బారావు

అలా కూర్చోండి' అని హాల్లో సోఫా చూపించింది కమల ఆ గదిలోకి రావడం అదే మొదటిసారి హాలు ఎంతో అందంగా వుంది నేల మీద కార్పెట్ గోడలకి ఆయిల్ పెయింటింగ్స్ అందమైన ఫర్నిచర్ — అంతా చూస్తుంటే వాళ్ళ అభిరుచికి అద్దం పట్టినట్టుంది

సుబ్బారావు కూర్చున్నాడు

రాధ పేరంటాని కెళ్ళింది రావడానికింకా రెండు — మూడు గంటలు పట్టొచ్చు అంది కమల విలాసంగా జుత్తు ముందు కేసుకుని దువ్వు కుంటూ

తాళం యిస్తే మధ్యలో ఆపేసాడు సుబ్బారావు

ఏం వెళ్ళిపోతారా? ఎందుకా తొందర? ఇంట్లో రాధ లేదని మర్చిపోయారా' ముసి ముసిగా నవ్వింది కమల

సుబ్బారావు నోరు పెగల్లేదు తలలో ఆలోచనలు కందిరీగల్లా రొద చేస్తున్నాయి ఆమెను చూస్తూ తనిక్కడ వుండలేడు ఆడవాళ్ళను తక్కువ అంచనా వేయగూడదు ట్రిగ్గర్ నొక్కిన గన్‌లోని బుల్లెట్లలా, విసిరిన బాకుల్లా ఎప్పుడెలా వచ్చి పడతారో తెలీదు కంట్రోల్ తప్పకుండా జాగ్రత్తలు తీసుకుంటూ లేచి నిలబడ్డాడు

ఇంట్లో రాధ లేదన్నాను మర్చిపోయారా'


లేదు'

అయితే కూర్చోండి కాఫీ తాగెళుదు రుగాని' నవ్వుతూ అంది కమల

సుబ్బారావు కూర్చున్నాడు కమల కిచెన్‌లోకి వెళ్ళింది

ఆ చీరలో కమల ఆకర్షణీయంగా వుంది ఆమె వెళుతూంటే వెనక నుంచి ధైర్యంగా చూసాడు మనసులో కోరిక విజృంభిస్తోంది కానీ దాన్నెలాగో అణిచి పెట్టుకుంటున్నాడు సుబ్బారావు

కాఫీ కప్పు చేతికిచ్చి సుబ్బారావు కెదురుగా కూర్చుంది తనూ కాఫీ తాగుతోంది కప్పు చేతో



పట్టుకుని కమలని కళ్ళతో తాగుతున్నాడు సుబ్బారావు

ఎమిటా చూపులు? కాఫీ చల్లారిపోతోంది' అంది కమల

మీరు చాలా అందంగా వున్నారు' అనాలనుకున్నాడు సుబ్బారావు కానీ అతని పెదాలు బిగుసుకుపోయాయి మనసు స్తంభించిపోతోంది కాఫీ తాగుతూ మౌనం వహించాడు

ఏమిటి విశేషం? ఇంట్లో కూడా యిలాగే వుంటారా'

కళ్ళెత్తి కమలని చూసాడు ఆమె కళ్ళు నిర్మలంగా వున్నాయి ఎప్పటిలాంటి చిలిపిదనం అలాగే వుంది

"రాధనే అడగకూడదూ?" అన్నాడు సుబ్బారావు.

"అడగడానికి నాకేమీ అభ్యంతరం లేదు. కానీ, అలుగుతుందేమోనని భయం. ఒకరి ప్రైవేట్ లైఫ్‌లోకి తొంగి చూడడం సభ్యత కాదని నాకు తెలీదా?"

"అయితే నన్నెందుకు అడిగినట్లు?" చురుగ్గా చూసాడు సుబ్బారావు.

గలగలా నవ్వింది కమల. "మరేం లేదు. ఇంట్లో కూడా యిలాగే వుంటే, రాధ ఎంత యిబ్బంది పడిపోతుందోనన్న ఆలోచనొచ్చి అడక్కుండా వుండలేకపోయాను'

ఇలా సాగింది సంభాషణ ఇంటికొచ్చి డబుల్ కాట్ మీద వాలి, కమల గురించే ఆలోచించసాగాడు సుబ్బారావు

ఆమె తనకు కావాలి ఆ క్షణంలో కమల మరో మగాడికి అర్ధాంగి అన్న విషయం మర్చిపోయాడు సమాజం దృష్టిలో యిలాంటి కోరిక నేరమని గుర్తురాలేదు ప్రమాదం లేనంతవరకూ ప్రమోదాన్ని సొంతం చేసుకోవాలనీ సగటు మనిషి ప్రవృత్తి సుబ్బారావులో తలెత్తింది ఆ రోజునుంచి ప్రతిరోజూ కమల గురించి ఆలోచిస్తూ, కనీసం ఒక్కసారి ఆమె అందాల చెక్కిళ్ళు ముద్దాడే అదృష్టమైనా దొరికితే చాలని వువ్విళ్ళూరసాగాడు

కానీ, ఆ అదృష్టం దొరకలేదు నెలలు గడిచాయి రోజూ కమల కనిపిస్తోంది అప్పుడప్పుడు ఏకాంతంగా కనిపించినప్పుడు తీయగా నవ్వుతోంది. కవ్విస్తోంది సుబ్బారావు నిద్ర మాయం చేస్తోంది

అందని ద్రాక్ష పుల్లన అని అన్నవాడెవరో అనుభవ శూన్యుడనుకుంటాను అందకుండా పోతున్న కొలదీ కమల చిటారు కొమ్మన మిఠాయి యిపోయింది. సుబ్బారావు మనసు నిండా 'కునేగ మరి కొళందు'లా గుబాళిస్తోంది

# ఎదురు చూసిన క్షణం

ఆ రోజు శుక్రవారం ఉదయం బ్యాంకు కెళుతుండగా కమల కనిపించింది రాధ లోపలెక్కడో పనిచేసుకుంటోంది కమల గేటు దగ్గిర నిలబడి. సుబ్బారావు కెదురైంది తలంటుకుని, కురులు విరబోసుకుని, మెరైన్ బ్లూ చీరకట్టి, మెళ్లో సన్నని చైన్‌తో చాలా అందంగా కనిపించింది బ్యాంక్ కెళుతున్నారా?" అంది

లేకపోతే మార్నింగ్‌షో, కెళుతున్నాననుకున్నారా? నవ్వుతూ అడిగాడు సుబ్బారావు

సుబ్బారావుని అలాగే నిలబెట్టి కబుర్లు చెప్పే ధోరణిలో కనిపించలేదు కమల, మీకు లంచ్ ఎన్నిగంట్లకి? అని అడిగింది

రెండు గంటలకి! ఎందుకలా అడిగారు? ఆశ్చర్యంగా అడిగాడు సుబ్బారావు

మీతో మాట్లాడాలి! బ్యాంకుకు రమ్మంటారా? నవ్వుతూ అంది కమల కానీ, ఆమె మనసులో ఏదో తుపాను చెలరేగుతున్నట్టు ఆమె ముఖం చెబుతోంది

సుబ్బారావు బయస్తుడు కమల బ్యాంకు కొస్తే యింకేమైనా వుందా? పైగా క్యాషియర్ రామగోపాలం ఆవలిస్తే ప్రేవులు లెక్కపెట్టే రకం తనింటికొచ్చే లోపలే ఈ వార్త రాధకి చేరేయగల ఘనుడు ఇదంతా లిప్తపాటులో ఆలోచించి, ' మా బ్యాంకు పక్కనున్న పార్క్‌కి అరుగంటలకి రండి అక్కడ మాట్లాడుకోవచ్చు అన్నాడు సుబ్బారావు

సుబ్బారావు కళ్ళలోకి సాలోచనగా చూసింది కమల " అవసరంలేదు మరోసారి మాట్లాడొచ్చు లెండి నాకోసం ఎదురు చూడకుండా మీ పనులు చూసుకోండి! అని జవాబు కెదురు చూడకుండా మేడమెట్లెక్కింది కమల

సుబ్బారావు మూసిన వీధి తలుపులు చూసి, రాధ తమని చూడలేదని గ్రహించి, తృప్తిగా బయటికి నడిచాడు

ఆ వేళ బ్యాంకులో సుబ్బారావు సరిగ్గా పని చేయలేకపోయాడు మూడు గంటలకే పర్మిషన్ తీసుకుని యింటి కొచ్చేసాడు రాధ యింట్లోలేదు తలుపుకు తాళమేసుంది బహుశా మార్కెట్‌కి వెళ్ళుంటుందనుకున్నాడు సుబ్బారావు

కమల కనిపించకపోతే రాద బయటికెళుతూ తాళం వరండా కిటికీ దగ్గర ముగ్గుడబ్బాలో పడేస్తుంది ఈ సంగతి గుర్తొచ్చి, అక్కడ తాళం కోసం వెదికాడు వుంది తలుపులు తీసుకుని లోపల కెళ్లాడు బహుశా కమల కూడా యింట్లో లేదేమో, లేకపోతే రాద తాళం అక్కడుంచదు అనుకున్నాడు సుబ్బారావు

బూట్లు విప్పుకుని బెడ్‌రూంలో పరుపుమీద వాలాడు బయట తలుపు తోసుకుంటూ హడావుడిగా కమల లోపల కొచ్చింది ఆశ్చర్యపోయాడు సుబ్బారావు లోపల కొచ్చిన కమల వీది తలుపు గడియవేసింది తన రొట్టె విరిగి నేతిలో పడ్డట్టు, తన్నితే బూర్లె గంపలో పడ్డట్టు, మూడు గంటలకే బయటపడి కమల ఒళ్లోపడ్డట్టు – ఇలా రకరకాలుగా ఊహించుకుంటూ కమలవేపు చూసాడు

మీ బెడ్‌రూం కిటికీ మూసేయండి అవతలి వాటాలో వున్న చుప్పనాతి రాణి యిటుచూస్తే ప్రమాదం! అంది కమల

కిటికీలు మూసేస్తూ తన అదృష్టానికి లొట్ట లేసుకుంటూ కోరికతో కమలని చూసాడు సుబ్బారావు

ముందుగా ఆ గులాబీ బుగ్గల్ని ముద్దెట్టుకోవాలి ఊహు, ఆ ఎర్రని పెదాల్ని రుచిచూడాలి ఊహు, ముందుగా ఆ వెచ్చని కౌగిల్ని ఆస్వాదించాలి ఇలాంటి అదృష్టం ఎప్పుడో గానీ రాదు

ఇదేమిటీ? కమల యింకా తనకి దూరంగానే వుందే! ఈపాటికి తన కౌగిలిలో వుండాలి గదా! ఆశ్చర్యంగా సుబ్బారావు కమలని చూసాడు

'చూడండి సుబ్బారావుగారూ, మీరు చాలా మంచివారు మిమ్మల్ని చూసినప్పటినుంచీ మీమీద నాకు సదభిప్రాయం, అబిమానం కలిగాయి మిమ్మల్ని మా కుటుంబ సభ్యునిగా, నేనూ, మా ఆయనా బావిస్తున్నాం "

ఈ ఉపోద్ఘాతం దేనికో సుబ్బారావుకి అర్థం కాలేదు ఎదురు చూసిన క్షణం, ఆశించిన శుబగడియ, దేనికోసం యిన్నాళ్లూ అలమటించాడో ఆ మంచి తరుణం, వచ్చి కూడా రాకుండా పోయినట్టు – నోటివరకూ వచ్చిన నేతి మిఠాయి చేజారి మట్టిలో పడ్డట్టు అనిపించింది సుబ్బారావుకి

చూడండి, రాధ నాకు తోబుట్టువు కాదు అయినా నా సోదరిగా బావించాను రాధ చిన్నది అనుబవం లేనిది చిన్నతనంలో చేసిన చిన్నవాళ్ళ తప్పులు అన్నీ తెలిసిన అనుబవజ్ఞులూ, విజ్ఞులూ క్షమించాలి బార్యాభర్తల బందం – చీకటీ వెలుగూ, రాత్రీ పగలూ మధ్య అనుబంధం లాంటిది వాటి మధ్య వున్న బంధం విడదీయరానిది ఒకదాని తరవాత మరొకటి క్రమం తప్పకుండా అవి మన ముందుకు వస్తున్నాయంటే, వాటి మద్య వున్న గొలుసు ఎప్పుడూ 'లింకు' తప్పక పోవడమే కారణం ఆ 'లింకు'కున్నంత బలం భార్యాబర్తల అనుబందాని కుండాలి అని కాసేపు సుబ్బారావు కళ్ళలోకి చూసింది కమల

మీరనేదేమిటో అర్థం గావడం లేదు అన్నాడు అయోమయంగా చూస్తూ సుబ్బారావు

మనిషి 'తప్పు' చేయడం – పగలు తరవాత రాత్రి రావడమంత సహజం తప్పు లేని జీవితం పున్నమి లాంటిది అలాంటి పున్నమి చంద్రుడికి కూడా మచ్చ వుందంటారు జీవితంలో చీకటి క్షణాలు రాక తప్పవు కానీ, జీవితమంతా అమావాస్య చేసుకోగూడదు ఇది విజ్ఞులు పాటించాల్సిన ప్రాథమిక సూత్రం కమల మళ్ళీ ఒక క్షణం మౌనం వహించింది

సుబ్బారావుకి మతిపోయినంత పనైంది మరి కాసేపు కమల యిలాగే మాట్లాడితే, సుబ్బారావు 'జుట్టు పీక్కునేవాడేమో! కానీ, కమల అసలు సంగతి ఆ తరవాత టూకీగా చెప్పేసింది

రాదకి సుధాకర్ డిగ్రీలో క్లాస్‌మేట్ బాగా డబ్బున్న వాడు మద్రాసులోనే ఏదో వ్యాపారం మొదలు పెట్టాడు ఒకరోజు పాండీ బజార్లో రాదని చూసాడు కలిసి కాఫీ తాగారు ఆ తరవాత రోజూ ఏదో సమయంలో రాదని కలుస్తున్నాడు సుదాకర్ అతని పట్ల రాదకి ఆకర్షణ పెరుగుతుందని, వాళ్ళ దోరణి బట్టి పసిగట్టింది కమల తప్పు జరక్కుండా రాదని కాపాడుకోవల్సిన బాద్యత గుర్తు చేసింది సుబ్బారావుకి ఈ సంగతి తెలియనట్టే వుంటూ, రాద మరో మగాడి గురించి ఆలోచించనీయకుండా జాగ్రత్త తిసుకోమని చివరి మాటగా చెప్పింది కమల

ఎవరో చెంప చెళ్ళుమనిపించినట్లు గింజుకున్నాడు సుబ్బారావు

నేను చెప్పిన సంగతులు గుర్తు పెట్టుకోండి సుబ్బారావుగారూ! మనలో తప్పు లేకపోయినా, చూసిన వాళ్ళకు కూడా అలాగే అనిపించేలా మనం జాగ్రత్తలు తీసుకోవాలి అందుకే పక్కింటి రాణి కోసం కిటికీలు మూసేయమన్నాను బ్యాంకుకు రావద్దని మీరన్న సూచనతో నిజాన్ని గ్రహించి, పార్క్ కూడా తగని స్థలంగా గుర్తించాను వీలైతే కొన్నాళ్ళు సెలవు పెట్టి, మీరిద్దరూ ఎక్కడికైనా తిరిగి రండి 'తప్పు' ఎదుటి వాళ్ళ మీదే తోసేసే బలహీనతకు లోను కావొద్దు! వస్తా! అంటూ తుపానులా తలుపులు తీసుకుని వెళ్ళిపోయింది కమల

ఎదురు చూసిన క్షణం వచ్చి పోయింది □

